సుప్రీం ఆదేశాలు బేఖాతర్!

- వాహనాలకు విచ్చలవిడిగా నలుపు రంగు ఫిల్మ్‌లు
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు

తాడిపత్రి రూరల్: నాలుగు చక్రాల వాహనాలకు(కార్లు) నలుపు రంగు ఫిల్మ్‌లు వాడొద్దంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను వాహనదారులు బేఖాతర్ చేస్తున్నారు. యథేచ్ఛగా బ్లాక్ కలర్ ఫిల్మ్‌లు వాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో దేశంలోని పలు ప్రాంతాల్లో జరిగిన కిడ్నాప్‌లు, ఇతర అంవాఛనీయ సంఘటనలకు పాల్పడేందుకు తమను పోలీసులు కనిపెట్టకుండా ఉండేందుకు దుండగులు నలుపు రంగు ఫిల్మ్‌లను కలిగిన అద్దాలు ఉన్న కార్లు, వాహనాలను ఉపయోగించారని పలు కేసుల విచారణలో తేలింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కార్లు, ఇతర వాహనాల అద్దాలపై నలుపు రంగు కలిగిన ఫిల్మ్‌లు అతికించరాదని 2012లో సుప్రీంకోర్టు ఆదేశించింది. వీటిని అమలు చేయాల్సిన బాధ్యతను పోలీసు, రవాణా శాఖలకు అప్పగించింది. తాడిపత్రి రవాణా శాఖ పరిధిలో వ్యక్తిగత కార్లు దాదాపు 1000, ట్రావెల్స్ వాహనాలు దాదాపు 300 దాకా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.


రంగు ఫిల్మ్ అద్దాలు ఉన్న వాహనాలు


కొత్త వాహనానికి సైతం రంగు ఫిల్మ్ అతికించిన దృశ్యం

జెడ్‌ప్లస్ కేటగిరీ వారికి మాత్రమే

భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని జెడ్‌ప్లస్ కేటగిరీ ఉన్న వారికి నలుపు రంగు ఫిల్మ్ వాడొచ్చని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రముఖ వ్యక్తులు సైతం రంగు ఫిల్మ్‌లేని అద్దాలు ఉన్న వాహనాలను మాత్రమే ఉపయోగించాల్సి ఉంది. ఈనిబంధల మినహాయింపు ఎంతో కష్టతరం. రాష్ట్ర హోం సెక్రటరీ అధ్వర్యంలో డీజీపీతో పాటు ఇతర ప్రముఖ అధికారులతో కూడిన కమిటీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని వినహాయింపు ఇవ్వచ్చు లేక ఇవ్వకపోవచ్చు. అత్యంత్య సమస్యాత్మకమైన తాడిపత్రి ప్రాంత వాసులకు చెందిన వాహనాల అద్దాలకు రంగు ఫిల్మ్‌ల మినహాయింపు దుర్లభమే.

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాహనాల వెనుకవైపు అద్దాలు 70శాతం, పక్కడోర్ల అద్దాలు 50శాతం విజువల్ లైట్ ట్రాన్స్‌మిషన్ ఉండాలని సూచించింది. ఫిల్మ్‌తోపాటు అద్దాలు నిర్ణీత పరిమాణాలను మించి ఉండరాదని ఉత్తర్వులు ఉన్నాయి. వాహనాల్లోని లోపలి భాగాలు స్పష్టంగా కనిపించడానికి వీలు ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నిబంధనలను వాహనదారులు తుంగలో తొక్కుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో రోజూ ఇలాంటి వాహనాలు అధిక సంఖ్యలో చక్కర్లు కొడుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు. నిబంధనలను తుంగలో తొక్కుతున్న వారిలో రాజకీయ పార్టీ మద్దతుదారులు, కాంట్రాక్టర్లు, బడా వ్యాపారులు ఎక్కువమంది ఉన్నారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు సరిహద్దు కేంద్రంగా ఉంది. తాడిపత్రి ప్రాంతంలో భారీ పరిశ్రమలతో పాటు చిన్న చితక పరిశ్రమలు ఉన్నాయి. అయా జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ ఇసుక, మట్టి తదితర దందాలలో రూ.కోట్లలో అక్రమంగా సంపాదిస్తున్నారు. ఈ సంపాదన ద్వారా వచ్చిన డబ్బుతో వాహనాలను కొనుగోలు చేస్తూ వాటికి రంగు ఫిల్మ్‌లను అతికించుకుంటూ జల్సాగా తిరుగుతున్నారు. వాటిలో ఎవరు ప్రయాణిస్తున్నారో, ఎవరిని కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నారో, అందులో ఎటువంటి మారణాయుధాలను తీసుకెళుతున్నారో, ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారో రోడ్డుపై వెళుతున్న వారికి తెలియని పరిస్థితి. మరోవైపు స్టిక్కరింగ్ దుకాణాలను కూడా నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్ ఫిల్మ్‌లను అతికిస్తున్నాయి. మారుతున్నారు.

నిబంధనలు ఇలా..

కేసులు నమోదు చేస్తాం



వాహనాల అద్దాలకు నలుపు రంగు ఫిల్మ్‌లను అతికించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిందే. వెంటనే అద్దాలకు ఉన్న ఫిల్మ్‌లను తొలగించుకోవాల్సిందే. మా దాడుల్లో దొరికితే వాహనాలను సీజ్ చేయడానికి కూడా వెనుకాడం.

– రాజగోపాల్, ఎంవీఐ, తాడిపత్రి

క్లుప్తంగా

ఎస్‌బీఐ సర్వీసు సెంటర్‌లో చోరీ


దొంగలు వేసిన కన్నాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో చోరీ జరిగింది. బుధవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. దొంగలు సెంబర్‌పై భాగంలో కన్నం వేసి లోపలికి దిగారు. క్యాష్ బ్యాక్స్‌లో ఉన్న రూ.1,000 నగదుతో పాటు కొన్ని విలువైన వస్తువులను అపహరించారు. ఏఎస్‌ఐ ఆజాద్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ నాయక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితుడు ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎండీయూ ఆపరేటర్లను తొలగించొద్దు


తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

గుంతకల్లు రూరల్: ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిన తమను తొలగించొద్దని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఎండీయూ ఆపరేటర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ పంపిణీలో భాగంగా ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టిన గత ప్రభుత్వం ఆపరేటర్లను నియమిస్తూ 2027 వరకూ తాము కొనసాగేలా అగ్రిమెంట్ చేసుకుందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అకారణంగా తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ తహసీల్దార్ రమాదేవికి వారు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: కల్లూరులో 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఎగువపల్లి నుంచి నారాయణస్వామి అనే వ్యక్తి బైక్‌పై కల్లూరుకు బయలుదేరాడు. కల్లూరు అంబేడ్కర్ సర్కిల్ వై జంక్షన్ వద్ద ఐచర్ డ్రైవర్ వాహనం వెనుక రివర్స్ చేస్తూ బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన నారాయణ స్వామి 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్


రౌడీషీటర్ల ఇంటి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో బుధవారం రూరల్ అప్ గ్రేడ్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ శివగంగాధర రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, గ్రామంలోని గడ్డి వాములు, అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లు, ఇతర ప్రదేశాల్లో క్షుణ్ణంగా సోదాలు చేశారు. అలాగే రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడినా లేక అల్లర్లను ప్రేరేపించినా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెచ్చెల్సీ చివరి ఆయకట్టుకూ నీరందించాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

శింగనమల: శింగనమల మండలంలోని ఐదో డిస్ట్రిబ్యూటరీ కిందనున్న హెచ్చెల్సీ చివరి ఆయకట్టు వరకు కాలువలను వెడల్పు చేసి సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం శింగనమలలో సీపీఎం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి హామీ కింద పనులు కల్పించాలన్నారు. రోజుకు కనీస వేతనం రూ.600 అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, కొండారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బిందె ఉత్సవం


పెన్నానది నుంచి ఊరేగింపుగా పవిత్ర జలాలను తీసుకొస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో బుధవారం బిందె ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భద్రావతి, భవనారుషీశ్వరుల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని అలయ కమిటీ సభ్యులు బిందె ఉత్సవం చేపట్టారు. పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వద్దనున్న పెన్నానది నుంచి పవిత్ర జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి భద్రావతి, భావనారుషీశ్వరులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. బిందె ఉత్సవంతో భద్రావతి, భావనారుషీశ్వరుల కల్యాణోత్సవం వేడుకలు ముగిసినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

దేవుని మాన్యం భూముల కౌలు వేలం

పామిడి: నెమళ్లపల్లి గ్రామంలోని ఆంజనేయ, ఈశ్వర, పోతులయ్య స్వాముల దేవుని మాన్యం భూముల కౌలు వేలం బుధవారం గ్రామంలో సజావుగా సాగింది. గుత్తి ఈఓ నాగేంద్రుడు ఆధ్వర్యంలో ఈఓ ఏ కృష్ణయ్య సమక్షంలో వేలం జరిగింది. వేలందారులు 19.13 ఎకరాల భూములను రూ.76,500కు వేలం దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.31,800 అదనంగా ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

ఘనంగా తిరంగా ర్యాలీ


జీకేఎస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో బుధవారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో త్రివిధ దళాలకు మద్దతుగా గాంధీ సర్కిల్ వద్ద మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, బీజేపీ జిల్లా, పట్టణ అధ్యక్షులు రాజేష్, వెంకప్ప, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆకుల మురళీ ర్యాలీని ప్రారంభించారు. గాంధీ సర్కిల్ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదగా రాయల్ సర్కిల్ వరకు అటు నుంచి తిరిగి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు కృష్ణయ్య, వివిధ సంఘాల నాయకులు ఓబుళలయ్య, బాల కృష్ణ, రమణ, బాబయ్య రాయల్, పాలమూరు రామాంజి రాయల్, సూర్య, మనోహర్, హాసన్ బాషా, రంగస్వామి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ఆపరేషన్ సింధూర్ విజయంపై మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తివర్ణ పతాకంతో అధికారులు తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్, స్టేట్ బ్యాంక్ తేరు బజార్, పెద్దమ్మ దేవాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్, ఐకేపీ ఏపీఎం నారాయణస్వామి, బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..సీతారాముల కల్యాణం


వేదికపై కొలువుదీరిన సీతారాములు


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

యల్లనూరు: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం సీతారాముల కళ్యాణం కమనీయంగా జరిగింది. అర్చకులు రాము, పవన్‌కుమార్ ఉదయం నుంచి ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తరించారు. వందన డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు వందన, ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో తాడిపత్రి బృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్యం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

హనుమాన్ రథోత్సవం జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని తలవాలకట్టవీధిలోని కోట వీరాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించే రథోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ గురువారం ఉదయం 6 గంటల నుంచి కలశస్థాపన, నవగ్రహ పూజ, పంచామృత అభిషేకాలు జరుగుతాయన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ వేదపండితులు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకూ అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి రథోత్సవం ప్రారంభం అవుతుందని, భక్తాదులు పాల్గొనాలని కోరారు.

దొంగ అరెస్ట్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

గుంతకల్లు రూరల్: పట్టణంలో ఇటీవల జరిగిన చోరీ కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సాయంత్రం గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాఘవేంద్రప్పతో కలిసి సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని ఆంధ్రా బ్యాంకుకు వెళ్లే దారిలో చెరుకు మిషన్ బండి నిర్వహిస్తున్న ఫక్రుద్దీన్ తన భార్య, ఇద్దరి కుమారులతో కలిసి జగ్జీవన్‌రామ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 13న ఫక్రుద్దీన్ కుమారుడు షేక్షావలి నామకరణ కార్యక్రమానికి మెట్టినింటి నుంచి వచ్చిన కూతురు భాను కూడా ఇక్కడే ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 17న భాను తన వదినకు బాగోలేకపోవడంతో మధ్యాహ్న సమయంలో ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి తీసుకెళ్లింది. పాత గుంతకల్లులోని కుంటెమ్మ కట్ట వీధిలో నివాసం ఉండే మోక శ్రీనివాస్ ఇళ్లముందు ఉండే ఇనుపవస్తువులు, సిల్వర్ వస్తువులు దొంగతనం చేసేవాడు. భాను ఇంటికి తాళం వేసి ఆ తాళాన్ని డబ్బాలో పెట్టడాన్ని గమనించిన శ్రీనివాస్.. వారలా వెళ్లగానే దర్జాగా తాళం తెరిచి ఇంట్లోకి వెళ్లాడు. బీరువాలోని ఆరు తులాల బంగారు నగలను ఎత్తుకుని ఉడాయించాడు. ఘటనపై కేసు నమోదు చేసిన అనంతరం రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టారు. ఈ నెల 20న పట్టణంలోని వాల్మీకీ సర్కిల్‌లో మోక శ్రీనివాస్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. చోరీ ఘటనలో లభించిన సీసీ ఫుటేజీ ఆధారంగా అతడే దొంగ అని తేలడంతో పూర్తిస్థాయిలో విచారించి చోరీకి గురైన బంగారాన్ని రికవరీ చేశారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించం


చిన్నవడుగూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

పెద్దవడుగూరు: మండలంలోని గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. చిన్నవడుగూరు గ్రామంలో బుధవారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రౌడీ షీటర్లు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడినా, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా తమ దృష్టికి తీసుకనావాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 9440796826 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పండ్ల అలంకరణలో నెట్టికంటుడు



గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో నాలుగో రోజు బుధవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి పండ్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవమూర్తిని ఆలయ ముఖ మండపంలో కొలువుదీర్చి మల్లెపూలతో లక్షార్చన పూజ చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ వాణి,సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం గుప్తా

గుంతకల్లు: ఉగ్రవాదాన్ని అంతమొందించేందకు ప్రభుత్వం కృషి చేయాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా కోరారు. బుధవారం గుంతకల్లులోని డీఆర్‌ఎం కార్యాలయంలో యాంటీ టెర్రిరిజంపై ఉద్యోగులతో డీఆర్‌ఎం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత పిచ్చితో ఉగ్రవాదులు చేసే దుశ్చర్యలకు అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, ఆర్‌పీఎఫ్‌లు పాల్గొన్నారు.

యోగాసన పోటీలకు ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటూ సాగే యోగాసన శిక్షణ బుధవారం వివిధ యోగా కేంద్రాల్లో ప్రారంభమైంది. వివేకానంద యోగకేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ.. జూన్ 21 వరకు వివేకానంద యోగా కేంద్రాలైన ఆర్ట్స్ కాలేజీ, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, జిల్లా పరిషత్తు హాలు, అశోక్ నగర్‌లోని సరస్వతీ విద్యామందిరం, రామనగర్ కమ్మభవన్, షిరిడీ నగర్‌లో వివేకానంద ప్రధాన కార్యాలయం, కోవూరు నగర్‌లోని విద్యారణ్య ప్రాంగణం తదితర చోట్ల ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 14, 15 తేదీల్లో యోగాసన పోటీలుంటాయని తెలిపారు. విజేతలకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం తరపున అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారన్నారు. ఆసక్తి కల్గిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆయా కేంద్రాలతో పాటూ 9963028694, 9441734555 నంబర్లలో సంప్రదించాలన్నారు.


నూతనంగా నిర్మిస్తున్న ల్యాబ్ భవనం

8 నెలలైనా పునాది దశలోనే..

యల్లనూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇందుకు మండల కేంద్రంలోని ల్యాబ్ భవన నిర్మాణమే నిదర్శనం. గతేడాది సెప్టెంబర్‌లో ల్యాబ్ భవన నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి 8 నెలలు కావొస్తున్నా పనులు పునాది దశ దాటలేదు. పీహెచ్‌సీలో ల్యాబ్ ఇరుకు గదుల్లోనే కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పనులు త్వరితగతిన పూర్తి చేయించి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.